✽ గడచిపోయిన గాథలు ✽

శ్రీ బలివాడ కాంతరావు

ఎదురుచూస్తున్న భర్త గుమ్మంలో కాలు పెట్టగానే ఆమె చెప్పాలనుకున్నది వెంటనే చెప్పింది. వెంకటేశ్వరరావు బట్టలు మార్చి సోఫామీద చారబడ్డాడు. ఈ చెప్పిన విషయంమీద తను చూపించిన ఆసక్తిలో వెయ్యోవంతైనా, భర్త కనపరచకపోవటం, ప్రమీల కేమీ నచ్చలేదు. మళ్ళీ ఆ విషయమే యెత్తింది

"ఇందులో యేముంది" అన్నాడు భర్త.

"లేదూ? వీధిలో నేకాదు, ఊరంతా చెప్పుకుంటున్నారు!"

"నువ్వేకదూ విన్నావు?" చిన్న నవ్వుతో అంటే...

"అబ్బా! ఆ అమ్మాయి చాలా అందకత్తె... చదువుకుంది"....

"అంచేత తనకు నచ్చిన మొగుడ్ని చూసుకొంది. ఇందులో గొప్పేం వుంది? తప్పేం వుంది?"

"అలా జాతీ, నీతీ లేకండా లేచిపోవడమే!"

వెంకటేశ్వరరావు చిన్నగ నవ్వునవ్వాడు: బాత్‌రూమ్‌కి వెళ్తూంటే ప్రమీల చిరాకుగా "మీ కెన్నిసార్లు చెప్పాలి, చెప్పల్సు వేసుకువెళ్లండీ!" ఈసారీ దరహాసంచేసి చెపల్సు వేసుకొన్నాడు.

డైనింగు టేబిల్ దగ్గర కూర్చునే టప్పుడు కూడా ప్రమీల మళ్ళీ యీ విషయం యెత్తకండా వుండలేకపోయింది. భర్త యిదొక మామూలు విషయంగా తీసుకోవటం ఆమెకేమీ నచ్చలేదు. లేచిపోయేముందు, "పోనీ వాడి అందంచూసైనా లేచిపోయిందంటే, అదీకాదు—అట్టే బావుండడట!" అన్న భార్యవేపు చూసి మళ్ళీ చిన్నగ నవ్వునవ్వాడు గాని వ్యాఖ్యానించలేదు.

మరుసటిరోజు పనిమనిషిద్వారా మరికొన్ని విషయాలు తెలుసుకుంది. ఈ పనిమనిషి లేచిపోయిన అమ్మాయి తండ్రి యింట్లోకూడా పనిచేస్తోంది. కబుర్లు, వ్యాఖ్యానాలతో సహా వస్తున్నయ్—"చూసెమ్మా! మొగాళ్లని నమ్మనేం! ఆడదాని వంటిలోన యెక్కడికంపె అక్కడుంటే, నమిలి మింగేసినట్టు చూస్తారు! నాకు యీదిలోంచి తలెత్తుకోని యెల్లడానికే భయం," అన్నది.

ప్రమీలకు యీ మాటలు మోటుగా అనిపించినా పక్కున నవ్వింది. "ఏమమ్మ నవ్వతిన్నావంది" పనిమనిషి. ఏమీ లేదులే అంటూ గదిలోనికి వచ్చి పకపకా నవ్వుతూన్న ప్రమీలను, భర్త, పనిమనిషి వేసిన ప్రశ్నే వేశాడు." మీరూ దానిలానే అడిగారు? మీ పనిమనిషి వీధిలోనించి తలెత్తుకు వెళ్ళటానికి భయమట—అందగాళ్లంతా నమిలి నమిలి మింగేస్తారట!"

భర్త మాటాడకండా పక్కగదిలోకి వెళ్లిపోయాడు. ప్రమీలకిదేమీ నచ్చలేదు. ఈ నల్లటి కొరివి దెయ్యంలా వున్న పనిమనిషి కోతలకి భర్త కూడా నవ్వితీరాలని పక్కగదిలోకి వెళ్ళి, భర్త ముఖంవేపు చూసి నవ్వుతోంది. వెంకటేశ్వరరావు ముఖం గంభీరంగావుంది. జరిగింది—దగ్గరగా జరిగింది. ముఖంలో ముఖం పెట్టి 'నవ్వరూ!' అంది.

నవ్వాడు. ఆమె కదే తృప్తి—మళ్లీ పెరటికి వెళ్లింది. వెళ్తుండగా ఆమెవేపు చూశాడు. ఆ నవ్వే మనసులో నవ్వుకున్నాడు.

భర్త మోటారు సైకిలుమీద ఆఫీసుకు వెళ్ళిపోయాడు. షేక్సిపియర్, డికెన్సు యేనాడో పూర్తి చేసింది. హోం లైబ్రరీలో పుస్తకంకోసం వెతికి, ఒకటి తీసి మళ్ళీ యింకొకటి...చివరకు చదువుమీద మనసు పోలేదు. అద్దంముందు కాస్సేపు కూర్చోవాలనిపించింది. చిదిపితే రక్తం వస్తుంది...తప్పదు... గొంతుకనుంచి నీరు దిగితే కనిపిస్తుంది! సంస్కారం ప్రతీ అందమైన కణంలోనూ, నిండిపోయిందని వుబ్బిపోతూ, గిరగిరా తిరుగుతూ, చప్పున నిల్చుని, భర్త గురించి రోజూ గర్వపడేటట్లే, పడుతూ; ఆవేళ

ఉదయం—పనిమనిషి...తను నవ్వకపోవటం...తనే నవ్వించటం...అంతా తలుచుకుని, ఆలోచించింది. "నవ్వమనేవరకూ, నవ్వారు కాదుకదూ? యీ వేళ సాయంత్రం కాసేపు యేడిపిస్తాను. ఏవుంది యేడిపించటానికి? యేమన్నా చులకనగానే తీసుకుంటారే? సరైన ఉపాయం ఆలోచించాలి?"

ఆలోచించింది. సాయంత్రం యెదురుచూస్తున్న భర్త వచ్చాడు. "మీ సంగతి తెలిసిందిలెండి?" అంది. భర్త ఒకసారిచూసి మళ్ళీ ముఖం త్రిప్పేశాడే గాని, జవాబీయలేదు. నాలుగైదు సార్లు నవ్వుతూ పదేపదే రెట్టిస్తే రెట్టిస్తే "కాపరానికి వచ్చి సంవత్సరమైనా, నా సంగతి యీవేళకా తెలుసుకున్నా" వన్నాడు. దీనికి వెంటనే జవాబు దొరక్క గింజుకుని, ఆ మరుసటిరోజు ఆఫీసుకు వెళ్ళేముందు మాటవరసకి "మీ సంగతి పూర్తిగా తెలిసిందంది."

"ఆ సంగతేదో చెప్పాలనివుంటే చెప్పు" అన్నాడు.

"ఏమీ లేదూ..."

"ఏమీ లేకుండా యింత గొడవ చేస్తావెందుకు?"

"ఉంది...మీకూ .."

"ఊ! చెప్పు! సగంలో ఆపటం దేనికి?"

"మీకూ ... పనిమనిషికీ ... " అంటూనే ఫక్కున నవ్వేసింది.

వెంకటేశ్వరరావు ముఖం తిప్పేశాడు. నవ్వండి అంది. నవ్వలేదు. "నవ్వుతారా లేదా?" రెట్టించింది. బట్టలు వేసుకున్న భర్త వెళ్లిపోతూంటే— "నిజం చెప్పేనా? కనుకున్నాలెండి!" ఈసారేనా నవ్వుతూ "నీకేం మతిపోయిందా" అని భర్త అంటాడని అనుకుంది. ఆగినభర్త యేమాటా అనలేదు. నవ్వకండా ప్రమీల "మాటండీ! నాదగ్గర దాపరికం చేస్తారా? నిజం చెప్తారా లేదా?"

భర్త వెళ్ళిపోతూ "నిజం" అన్నాడు.

గదిలో కూర్చుని మొదటిరాత్రి జరిగిన సంఘటన జ్ఞప్తికి తెచ్చుకుంది. భర్తగురించి తలుచుకున్నపుడల్లా, మిగతా మగవాళ్లు యేదో లోటున్నవాళ్ళగానే కన్పిస్తారు. "ముప్ఫయ్యేళ్ళవరకూ పెళ్ళి చేసుకోకండా, పవిత్రంగా ఉండే మొగా ళ్ళీరోజుల్లో యేరీ? ఇంత అందగాడిమీద బలేకథ సృష్టించానే—యీ కాకి వీధివెంబడివెళ్తే మొగాళ్ళు నమిలి మింగేస్తారా? — చెప్పకోడానికైనా సిగ్గు పడిందికాదే? ఏ ఆఫ్రికా అడివిలోనో తిరగవలసిన మనిషి—పోనీ అందంలేదూ అంటే, ముఖానికి పౌడరేనా రాస్తుందా? నగలుగానీ ఒక మంచిబట్టగానీ వుందా?—సంస్కారం యేకోశానాలేని యీ అడివిమృగంమీద కథ బాగా అల్లానే—! ఆయన నిజం అని వప్పుకోవటంకూడా బాగా నేవుంది. బలే అబద్ధాలుఆడి నన్ను యేడిపించాలని చూస్తున్నారు. ఇంత చదువూ చదివి, యీమాత్రం తెలుసుకోలేనా? తనకంటె హెచ్చు శాంతం చూపించగలను."

సాయంత్రం భర్త కాస్త ఆలస్యంగావచ్చాడు. డైనింగు టేబిల్ దగ్గర "ఉదయం వెళిపోయేటప్పుడూ ఏమన్నారండి" అంది.

"నిజం అన్నాను."

"మీ అబద్ధం నిజం చేసేయగలను"

"నే అబద్ధంఆడే అవసరం ఏముంది?"

"అయితే దానికి మీకు నిజంగాఉందంటారా?"

"అనవసరంగా నీవగర గొంగుకు అబద్ధం ఆడాలి? నువ్వెటిగావు...నిజం చెప్పటం నావిధి!"

ప్రమీల ఆయనవైపు ఒక్కసారిచూసి ముఖం దించుతూ "మీరు నిజం చెప్పకపోతే......" వెంకటేశ్వరరావు సగంలో అడ్డుతూ "నిజం, నిజం... మున్మాటకి నిజం!..."

ఉద్వేగంతో ప్రమీలకస్సుమంది..."అబద్ధం... అబద్ధం! భర్త మాటాడలేదు. చెలించనూలేదు. చప్పున లేచి నిల్చుని, "నిజం చెప్తారా లేదా?" భర్త మాటాడలేదు. దగ్గరగావచ్చి భర్తను కుదుపుతూ "నన్నేడిపించకండి! నిజం చెప్పండి!"

"నిన్నేడిపించకండానే నిజం చెప్పానుకదూ? ఆమెకూ నాకు వుండేది. అదీ ఒక్కసారే!" ప్రమీల కళ్ళల్లో గిరగిరా నీరు తిరిగింది. చప్పున కుర్చీమీద కూర్చుంటూ, డైనింగు టేబిల్ మీద తల ఆన్చి, వెక్కి వెక్కి యేడుస్తోంది. భర్త అలా మీదికి చూస్తున్నాడు. ఒక పావుగంటవరకు మాటాడని మొగుడు, యింకా భార్య యేడవటంచూసి" చదువుకున్నావేమో? యీమాత్రం యెదుటివాళ్ల హృదయాన్ని అర్థంచేసుకోలేవా?" అన్నాడు. తలెత్తింది కాని భర్తవేపు చూడలేదు.

"అనవా, అర్థం చేసుకోటానికి ప్రయత్నమైనా చెయ్యవా?" అని ప్రశ్నించాడు.

ప్రమీల చెయ్యిచాచింది. "నా చేతిలో చెయ్యి వేసి యిదంతా నిజం అని చెప్పండి" అంది.

"నేను నిజమే చెప్పాను. దీనివల్ల నీకు పూర్తి నమ్మకం కలుగుతుందంటే వేస్తాను. లేదా అంటే అనవసరం!"

ఆమె తలవూపింది. "ఇదంతా నిజం" అంటూ ఆమె చెయ్యిమీద చెయ్యి వేశాడు—ఇంకా ఆ చేతిని అలా వుంచాడు. ఆమె తనచేతిని చప్పున విసిరి, పక్కగదిలోకి పరుగెత్తింది.

తెల్లవారింది. ముఖం పాలిపోయినా, చూపు తీక్ష్ణంగా వుంది ఆ గది కదల్లేదు. భర్త మామూలుగా లేచాడు. కాఫీకి హోటలుకి వెళ్ళాడు. ఫ్లాస్కులో కాఫీ తెచ్చి భార్యయెదురుగా పెట్టి టూత్‌బ్రష్, పేస్టు అందివ్వబోయాడు. ప్రమీల ముఖం యెత్తలేదు. తీసుకోమంటే, అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది. ఆవేళ ఆఫీసుకి వెళ్ళటం ఆలస్యంఅయింది. తను హోటల్లో భోంచేశాక, కేరియర్ మోసుక వచ్చి, యింట్లో పెట్టి, చెప్పి మరీ వెళ్ళాడు. ప్రమీల పెరటినుంచి గదిలోకి వచ్చేసరికి బీరువా తలుపులు బారుగా తెరచివున్నాయ్. అందులో పుస్తకాలు తనవేపు చూస్తున్నట్లనిపించింది. ఇంచుమించు ఆ పుస్తకాలన్నిటితోను తనకు పరిచయంవుంది. కొన్ని పుస్తకాలు రెండు మూడుసార్లుకూడా చదివింది భర్తయెందుకిలా తలుపు తెరిచారో వూహించుకుంది. ఇందులో సగమేనా చదివితేనా తను, ఆమెను యెత్తిపాడవటానికి? ఆకలేస్తున్నా కాఫీతాగలేదు.—కూర్చో బుద్ధిపుట్టలేదు.—ఒక్కక్షణం అంతా తల్చుకుని యేడవాలనిపించింది. మరోక్షణం కన్నవారింటికి వెళ్ళిపోదామని.—కొంతసేపయాక్య మొగుడితో యిక మాటలే ఆడనని—కొంతసేపు విసుక్కుంటూ, పరుపుమీద పడుతూ లేస్తూ, కూర్చోలేక నిల్చోలేక, బాధపడుతూ వుంటే, పనిమనిషి వచ్చి "ఏం అమ్మగోరు—అలాగున్నారు?"

ప్రమీల తీక్ష్ణంగా చూసింది. "ఈ జాకెట్టులేని అడివిదున్న—దానిమీదా ఆయనికి మోహం.? మళ్ళీ ఆ మొరటుమనిషి మోటుగా ప్రశ్నించింది. ప్రమీల వినలేక "పో" అని గసిరింది. పోతావా లేదా అన్న యజమానురాలివేపు వింతగా చూస్తూనే కదలలేక కదిలింది. తలుపు వేసి పరుపుమీదపడి "యింత మోసం చేస్తారనుకోలేదు — ఆయన్ని యింక యెప్పుడూ, యేవిషయంలోనూ నమ్మకూడదు."!—

తను తెచ్చిన కేరియర్, అలా నిండుగా అక్కడే వుండటం సాయంత్రం వచ్చిన భర్త చూసి, అప్పట్లో యేం అనలేదుకాని, ఆరాత్రి హోటలునుంచి తెచ్చిన కేరియర్, డైనింగు టేబిలుమీద పెట్టి భార్యను రమ్మనమన్నాడు. ఆమె మాటాడలేదు.

"తిండిమానితే ఆలోచించే అవకాశం వుండ" దన్న భర్తకు గట్టి జవాబు యివ్వాలనుకొన్నా మాట్లాడటం యిష్టంలేక ఊరుకుంది. ఆయన భోజనం చేస్తున్నా తొంగి చూడలేదు. పడుకునేసమయానికి అన్నాడు. "ఇంకా అర్థం చేసుకోలేదా?"

కొరకొర ఒకసారి చూసి అక్కడనుంచి లేచి వెళ్ళిపోయింది. ఆమెకు వినిపించేటట్లు అన్నాడు. "నేనే అబద్ధం చెప్పుంటే?....

ఈప్రశ్న వేశాక రాత్రి వేసుకున్న పరుపుమీద మళ్ళీ మేనువాల్చి నిద్రపోయాడు. ఒంటిగంట రాత్రికి ఒకసారి తెలివివచ్చేసరికి చూశాడు. ప్రమీల ప్రక్క గదిలో అలానే ఒంటిగా సోఫామీద కూర్చుంది. దగ్గరగా టేబిల్ మీద లైటు వెలుగుతోంది. ఆమె ఏదో ఆలోచించుకున్నట్లున్నా భర్త దగ్గరగా రావటం గుర్తు పట్టక పోలేదు. కిటికీ తలుపు తీశాడు. 'రా' అని చెయ్యి పట్టుకున్నాడు. ఆమె చెయ్యి చిరాకుగా విడిపించుకుంది. కాస్సేపు యెదురుగా టేబిల్‌కు ఆనుకొని నిల్చున్నాడు. ఎదరగా కిటికీగుండా వీధిలైటు వెలుగులో యెవరో నిల్చున్నట్లనిపించింది. ఎవరు? లెక్చరర్ ప్రసాదరావా? కిటికీ దగ్గరకువెళ్ళి చూశాడు—ఆయనకాదు—రెండో ఆట సినీమాకు వెళ్ళిన యెదురింటాయన — వాళ్ళయింటి తలుపు తట్టున్నాడు.—

ఇంతలోనే ప్రమీల ప్రక్కగదిలోకివెళ్ళి, పరుపుమీద బోర్లగా పడుకుంది. వెళ్ళి ప్రక్కన కూర్చున్నాడు. ఆమె మరి కాస్త దూరంగా జరిగిపోయింది. చాలాసేపటివరకు మౌనంగావున్న భర్త ఆమెవీపుమీద చెయ్యివేశాడు. ప్రమీల ఏడుస్తూనే ఆపుకోడానికి ప్రయత్నిస్తోంది. ఆమె యేడుపు పూర్తిగా ఆగేవరకు ఊరుకుని, "ఇంకా నన్ను అర్థం చేసుకోలేదా?" అన్నాడు.

"చేసుకున్నాను. పూర్తిగా! ఉత్తి నీతిలేని..." ఆమె గొంతుక పట్టేసింది.

వెంకటేశ్వరరావు అక్కడనుంచి లేచి తన మంచంమీదికి వెళ్ళిపోయాడు. ప్రయత్నించినా నిద్దరపట్టలేదు. ఏదో మాటాడాలని అనుకున్నా, మాటాడక లేచి, టేబిల్ మీద లైటు వెలిగించి, కొంతసేపు యేదో రాసుకున్నాడు. రాసుకొన్నది పైకి చదవటం మొదలుపెట్టాడు. "నాకు ఒకనితో పరిచయం వుంది. తల్లి తండ్రి, నా అన్నవాళ్ళు లేక

కష్టపడి, నలుగురి దయాదాక్షిణ్యాలకు పాత్రుడై పెద్దవాడయ్యాడు. ఒక కంపెనీలో గుమాస్తాగా చేరి, స్వయంకృషివల్ల కొద్దికాలంలో అసిస్టెంటు మేనేజర్ అయ్యాడు. డబ్బుగురించి బాధపడ్డాడు గాబట్టి డబ్బు విలువ ఆయనకు తెలుసు. కష్టాలు అనుభవించిన మనసు—తను సుఖపడేటప్పుడైనా, యెదుటివాళ్ళ కష్టాలు వూహించడమే కాదు, తను అనుభవిస్తున్నట్లు బాధపడుతుంది. ఇంకా కొద్ది నెలలో తను మేనేజరవుతాడు. ఇప్పటికింకా తను ఒక ఆర్థిక అంతస్థులో వుండలేదు. మేనేజరయాకే పెళ్ళి చేసుకొంటే ఆర్థికంగా చిక్కు పడకుండా వుంటాడు. ఈ బ్రహ్మచారి వెంట కొందరు ఆడవాళ్ళుపడ్డారు. నిగ్రహం చూపించాడు. మరే వుద్దేశంతో కాదు. వచ్చే భార్యదగ్గర తను నేరస్థుడుగా ఉండగూడదని,—ఒకనాడు—అతను గడిపిన పదివేల రోజుల్లో ఒక రోజు అది.—తన జీవితంలో జరిగిపోయిన గాథల్లో ఒక గాథ.—తెల్లారి కళ్ళు విప్పేసరికి రోజూ వచ్చే పనిమనిషి ముసలమ్మ కాదు—మనుమరాలు వచ్చింది. కలలోనైనా ఆమెను తాకుతా ననుకోలేదు.—కానీ ఆమె యిదివరకు చాలాసార్లు చూసిన చూపుగురించి, ఆలోచించాడు. ఆ బాధపడ్డ మనసును అర్థం చేసుకొన్నాడు. చలించే అవకాశం లేదుకానీ, సానుభూతి చూపించకుండా వుండలేకపోయాడు! ఆ జాకెట్టు లేని మొరటుమనిషి—గది వూడుస్తుంటే—అదేవిటో ఆ నిముషం—ఆమె ఒక దేవతాస్త్రీలా కనిపించింది!—నరాలు వుబ్బి తబ్బిబ్బయాయ్.—అంతే తరవాత చాలా విచారించినా, మళ్ళీ యెందుకో మనసు తృప్తిచేసుకొన్నాడు! ఈ సంఘటనే ఆ కొద్దిరోజుల్లో పెళ్ళి ప్రయత్నాలు చేయించింది."

చదివాక మళ్ళీ యింకొకసారి, మెల్లగా ఆగి ఆగి చదివి, "ఆయనగూర్చి చెపుతూ నాగురించి చెప్పకున్నా ననిపిస్తోంది" అన్నాడు.

నిశ్శబ్దం. ఆలస్యంగా నిద్రపోయినా, మామూలుగానే తెలివి వచ్చింది. ఆఫీసుకు వెళ్ళేవరకు ఆమెలో యేమైనా మార్పు వచ్చిందేమో అని చూశాడు. నీతిని పరిపూర్ణంగా గౌరవించే భార్యలో మార్పు లేకపోవటంతో, ఆమె కూర్చున్న గదిలోనే యెదరగా వున్న టేబిల్ దగ్గర కూర్చుని కాగితం కలం తీశాడు.

వ్రాసిన కాగితంమీద వెయిట్ పెట్టి వెళ్ళిపోయాడు. వెళ్ళాక యేం వ్రాసారో చూద్దామనుకున్నా, ఒళ్ళుమండి చూడలేదు. ఇంతలో భర్త కేరియర్ మోసుకువచ్చి, మామూలుగానే గొంతుక మారకుండా, భోజనం చేసితీరాలి అని చెప్పి, ఆఫీసుకు వెళ్ళిపోయాడు. భోజనం చేసింది. ఇది ఆమెలో మార్పునుసూచించటం కాదు. ఆకలి వేస్తోంది. ఈ భోజనం చేసేముందు, వూళ్ళోవున్న కన్నవారింటికి వెళ్ళిపోదామని అనుకున్నా, తను యింతగా అలంకరించిన యిల్లూ—యీ సోఫాలు.—యీ అద్దంలా వున్న నేల—యీ ఫొటోలు—యీ జోళ్ళు—తను కదిలిన మరుక్షణంలో అన్నీ చిందరవందరైపోతాయ్! ఇంత అందగాడు.—గడ్డాం పెంచుతాడు—ఇప్పుడో—ఆమె బలవంతం చేస్తే—సూటు వెయ్యటం—నెక్ టై కట్టటం—అలా టెండి—తను లేకపోతే, ఆఫీసుకు బనియన్‌తోనైనా వెళ్ళిపోతాడు!—

చాలాసేపు ఆలోచించే భోజనం చేసింది. భోజనం చేసేటప్పుడు "ఉ! పెద్ద మేనేజరట! హొటలునుంచి నడిరోడ్డుమీద... సిగ్గులేదూ? కేరియర్ మోసుకొని..." భోజనం చేస్తున్నంత సేపూ అసహ్యంచుకొంటూనే వుంది. తరువాత చాలాసేపు తర్కించుకుని యేం వ్రాశారో అని తొంగిచూసింది! "ఇంతసేపు వ్రాసింది యింతే—అంతా నటన! నాకంటే హెచ్చు చదువుకోలేదు! తెలివితేటలతో నన్ను మోసపుచ్చుదామనుకుంటున్నారేమో?"

మళ్ళీ ఒకసారి ఉత్తరంవేపు చూచి ప్రతి అక్షరం చదివింది!

ప్రియమైన—

కొంద రాడవాళ్లు బలే తమాషాగా వుంటారు!

ఏం? మొగాళ్ళో? ఆడవాళ్ళేనా తమాషాగా వుండేది? కనిపిస్తోందిగా? భర్త వచ్చేవరకూ, జరిగింది నెమరు వేసుకొని, జరగబోయేది వూహించుకొంది.—వెయ్యివిధాలుగా ఆలోచించింది.....

భర్తవచ్చాడు. నీ వుత్తరం చూసే అవసరం నాకులేదని, ఆమె అనుకున్నట్లు, అతనికి తెలియాలని, ఆయన రాకముందే, ఆ గదిలోంచి వెళ్ళిపోయింది. వెంకటేశ్వరరావు వచ్చిరావటంతో, ఉత్తరంవేపుచూసి, తను అనుకున్నట్లుగా, భార్య వ్రాయకపోవటంతో, కలం తీశాడు. బట్టలుమార్చి బాత్‌రూమ్‌కి వెళ్ళాడు. ప్రమీల ఆతురతగా మళ్ళీ యేం వ్రాశారో అని వచ్చిచూసింది. వ్రాసిన ఒక వాక్యం ఆయన కొట్టేశారు! నిజంగా... తన ఆలోచనలన్నిటిమీద క్రాస్‌మార్కులు పడ్డాయ్!...

గదిలో కాలు పెట్టిన భర్త, "పనిమనిషివున్నా కాఫీ యెదరగావచ్చేది" అన్నాడు. భార్యకు దినిత

ఒళ్లు మండిపోయింది. అంతతో వూరుకోక, చిరునవ్వుతో భార్య యెదురుగా వెళ్లి, "మంచివాళ్ళనుకొనే ప్రతీవాళ్ళలోనూ, వాళ్ళకు కనిపించని చెడుగు వుండి తీరుతుంది ఆ చెడుగు తెలుసుకోని, సరిదిద్దుకోకపోతే, వాళ్ళ మంచితనాన్ని ఆ చెడుగు వేగంగా కబళిస్తుంది!"—టేబిల్ మీద పుస్తకంవిప్పి చదువుతున్నట్లుగా, యీమాటలు జార్చాడు! ప్రమీలకు తెలుసు, యిది భర్తకూర్పని—ఆమెకంటే తను తెలివైనవాడినని నిరూపించాలనా తన వుబలాటం! తనకంటె ఆమె హెచ్చు చదువుకుంది.—ఆమె పుట్టి పెరిగింది పెద్దయింట్లో—ఆమె విసుక్కున్నా చూసి ఆనందించినవాళ్లు కాలేజీలోనే కాదు — బయట యెందరుండేవారు?—

భర్త ఉబలాటానికి మనసులోనే అసహ్యించుకొంది. వెంకటేశ్వరరావు, ఆరాత్రి పుస్తకం పట్టుకుని కూర్చున్నాడు. ఉండిఉండి తలెత్తి ప్రక్కగదివేపు చూస్తున్నాడు! రాత్రి పదైంది. వెన్నెల రాత్రేమో, వీధిలైట్లు ఆర్పేశారు. వస్తున్న మలయమారుతం తన నేనో చలింపచేసింది. మెల్లగా లేచాడు. తన శరీరం పట్టుతప్పి, ఆమె దరిచేరుస్తున్నట్లనిపించింది. కానీ మళ్ళీ మనోనిగ్రహం తెచ్చుకొనే ప్రయత్నంలో కూర్చున్నా—"ప్రమీ!" అని పిలవకుండా వుండలేకపోయాడు. జబాబు లేకపోవటంతో మనసు చివుక్కుమన్నా, తమాయించుకొని లేచాడు. ఆ గదిలోకివెళ్లి, ఆమె ప్రక్కనకూర్చుని, "ఇంకా యెంతకాలం యీ కలహం!" అన్నాడు.

జవాబులేదు—

"కన్నవారింట్లో నేవుంటే, నాకింతగా బాధ వుండేదిగాదు!"

ఈమాటలు అన్నాక తన అనిశ్చలత స్ఫురించి, అక్కడనుంచి లేచిపోయాడు. ఆగది విడిచిపెట్టి మళ్ళీ మొదటిస్థలంలోకూర్చుని భార్య వస్తుందేమోనని చూశాడు. —

పన్రెండుగంటలయింది—రాలేదు! ఆగదిలో అప్పుడు దీపం ఆరింది. ఈగదిలోనూ దీపం ఆర్పేశాడు. తెల్లారిలేచాక యెర్రగావున్నకళ్ళను మరింత యెరుపుచేద్దామనుకున్నా, ఒక అరగంట పోయాక, తను సహనాన్నివీడి, పొరపాటు చేస్తున్నానని బాధపడ్డాడు.

మళ్ళీ భార్యను మామూలుగా పలుకరించాడు—కాఫీ తెచ్చాడు. కేరియర్ తెచ్చి భోజనం చెయ్యమన్నాడు. ఆఫీసుకు వెళ్లేముందు ఉత్తరంకూడా వ్రాసేడు! ఆమె చదివింది!—

ప్రియమైన—

నాకు చాలా అందమైన భార్య వుంది. నాకు యీ విషయంలో గర్వంలేదు.—కాలేజీ చదువు—కావలిసినంత ప్రపంచజ్ఞానం, అన్ని హంగులున్నా, యీమె నిజం చెప్పిన భర్త నిజాయితీని, అర్థం చేసుకుంటుం దనుకున్నాను. కానీ యీమెతో నాకున్న సంవత్సరం పరిచయంతోనూ, ఒక విషయం నిర్ధారణగా తెలిపోయింది. ఏ అనుభూతినైనా అర్థంచేసుకుని అనుభవించలేదు..."

చదువుతూ చప్పున ఆగి "అతి తెలివి!!" అని వికటంగా నవ్వుకుంటూ మళ్ళీ దృష్టిపోనిచ్చింది.

"నా గడచిపోయిన గాథనుగురించి, యింత రాద్ధాంతం చేస్తోంది! ఆమె గడచిపోయిన గాథ నాకు తెలియ దనుకుంటుందేమో?

ఇంక చదవలేదు. చదవటానికి యింకేమీ లేదు. నిప్పు నిమిష నిమిషానికి రాజుకపోతోంది. భర్త యింటికి వచ్చేసరికి మంటలు మీదికొచ్చాయ్?

"ఏం తెలుసు? నీలానే నేను నీతిలేకుండా, యెవరితోనూ పోలేదే? ఎందుకిలా రాశా?"

భర్త హఠాత్తుగా అడ్డి "పోయేవని యెవరన్నా" రన్నాడు.

"ఎవరా? ఏం రాశారో చూడండి!"

"నే నేం అబద్ధం రాయలేదే?"

"నిజమా? మీకిదంతా నిజమా?" అంటూ అరుస్తూనే ఆ వుత్తరాన్ని ముక్కలు ముక్కలుచేసి నేల నేసికొట్టింది. అక్కడనుంచి, చర్రున కదిలి పరుపుమీదపడి వెక్కి వెక్కి యేడుస్తోంది.

వెంకటేశ్వరరావు, మండే మంటలో ఆజ్యం పొయ్యదల్చుకోలేదు. మౌన జలంతో మంట నార్పుతున్నాడు. ఆ రాత్రి ఇద్దరూ భోజనం చెయ్యలేదు. ఆయన చిరిగిన వుత్తరాన్ని మళ్ళీ ఒక కాగితంమీద అంటించి జీవం పోశాడు. ఆ వుత్తరాన్నే ఆరాత్రి పొడిగించాడు!

"అవును. ఉత్తరం చింపేయటం సులభం—మళ్ళీ అతికటం కష్టం—అతికినా దాని అసలు రూపుపోయింది! త్వరపడి ఒక నిమిషంలో చూపించిన పౌరుషం, వల్లవచ్చిన, ఫలితాలు జీవితం మీద, యిలాంటి ప్రభావాన్నే చూపిస్తాయ్!

కాని ప్రపంచంలో అందరూ అల్పులైవుండరు. మానవులలో కొందరు ఉన్నత దృక్పథంతో వున్నారు కాబట్టే, యిలా చిరిగిన జీవితాలను అతుకుతూ, యీ ప్రపంచాన్ని నడిపిస్తున్నారు. వాళ్ల మెదడు, అందరి మెదడులా, ఆ పుణుకలోనే యిమిడి వున్నా, అది ప్రపంచమంత విశాలంగా వుంటుంది. ఆ విశాలతలో, అవినీతికీ వాటి బంధువర్గానికీ, కూడా ఆశ్రయందొరికి, వాటంతటికి అవే, మారిపోటానికి అవకాశం యిస్తుంది.

ఆ విశాలతే, యింత చదువుకున్న నా భార్యకు లేదని విచారిస్తుంటాను! ఆమె వచ్చిన యీ యేడాదిలో, యెదుటివాళ్ల ఒక తప్పుని విడిచిపెట్టకండా, భూతద్దంలో పెట్టిచూచింది. ప్రపంచం బ్రద్దలైపోతున్నట్లు అరిచింది—బాధపడ్డది—ఈ లోకంలో యే మానవుడు యే కాలంలోనూ, పరిపూర్ణుడు కాలేడు. మంచి చెడ్డల కలయికే మానవుడు. వ్యక్తిలో చెడ్డనే తీసుకొని అట్టహాసం చెయ్యటం, సంస్కారం గల వాళ్ళ లక్షణం కాదు. దగాపడిన మానవుల తప్పులను యెత్తి గగ్గోలు చెయ్యటం కంటె, వాళ్ల బాధలకు సానుభూతి చూపించి, వాళ్ల తప్పులను మన్నించాలి. ఇలా చెయ్యటానికి మనిషి ప్రేమమయుడుగా వుండాలి!

నా భార్యకు, నాకంటె హెచ్చు చదువుకున్నాననే గర్వం వుంది. ఆమెకంటే నేను గొప్పవాడనని నిరూపించాలని, నేను ప్రయత్నిస్తుంటానని, ఆమెకు అనుమానం వుందని, నాకు తెలుసు! నాకా ప్రయత్నం లేదు! కాని చదువుకున్నంత మాత్రాన, సంస్కారం అబ్బిపోదు. మనసు వికసించిన వాళ్ల సహవాసంవల్ల మనిషికి, అసలైన సంస్కారం అబ్బుతుంది. నాకటువంటివాళ్ల సహవాసం అబ్బిందంటే గొప్ప చెప్పుకోవటం కాదు!

ఇప్పుడు యింతకీ జరిగిందేమిటి? నా గడిచిపోయిన గాథను వివరించాను. నేను అబద్ధం ఆడితే నా భార్య మనసులో యిదివరలా "అందమైన ఉత్తముడు నా మొగుడు" అనే భావనగా వెలిగిపోతాను. నేను అబద్ధం ఆడి దూదిలా యెగిరిపోతాను. నిజం చెప్పాను. నా విజాయితీలో వెయ్యోవంతు ఆలోచించినట్లు లేదు. ఆ గడిచిపోయిన గాథనుంచి నేను నీతిని నేర్చుకున్నాను. వెంటనే పెళ్లిచేసుకొన్నాను. లెక్చరరు ప్రసాదరావు ప్రేమగాథ యీమధ్య నాకు తెలిసింది. ఆయన యీనాటికి యీమె ముఖమైనా చూడాలనే ప్రయత్నంతో, యీ వీధివెంట రాత్రనక పగంనక తిరుగుతుంటాడు. ఆయనతో పరిచయం చేసుకున్నాను. సంస్కారం గల పెద్దమనిషి! ఆయన చేసినది ఒకే ఒక తప్పు—అందాన్ని చూశాడేగాని ఆత్మని చూడలేదు. ఒక హృదయంలేని బొమ్మను ఆరాధించాడు—యిదివరకు యీయనగురించి నాభార్యతో యెన్నిసార్లో చెప్పాను.—కాని ఒక్కసారైనా ఒక సానుభూతి వాక్యం పలకలేదు!

ఈ గడిచిపోయిన ఆమె గాథనుంచి ఆమె నేర్చుకున్నది యేమీలేదు. మానవులమనసులో రేగిన కల్లోలాన్ని అర్థం చేసుకొంటే కన్నీరు కార్చకపోయినా, అథవా ఒక సానుభూతివాక్యమైనా పలుకుతాం! ప్రసాదరావు ఆరాటాన్ని—ఈనాటివరకు బ్రహ్మచారిగా — బహుశా జీవితంలో అలా వుండిపోతాడేమో—? ఆ మనసుయొక్క మహా సంక్షోభాన్ని కొద్దిగనైనా వూహిస్తే—ఆమె ఆయనను భర్తలా చూడమని కాదు — అయ్యో పాపం—ఇంత బాధ పడుతున్నాడే—యిదివరలా అరవకండా..."క్షమించండి — మీ బాధ అర్థం చేసుకొన్నాను. కాని యీజన్మలో సానుభూతి తప్పించి యింకేమీ చెయ్యలేనని" చెప్పగలిగేది. — ఆ గాథనుంచి యీమె యేమీ నేర్చుకోలేదు. — నేర్చుకొనే వుంటే యీ నాలుగురోజుల్లో జరిగిన గాథను యింత పెద్ద కలహం చెయ్యకండా యిట్టే పరిష్కారం చేసివుండును. పనిమనిషి యీమెలా అందకత్తె కాకపోవచ్చు—కాని తనలాంటి ఆడది. ప్రమీలనుచూస్తేనే మగవాళ్లు పిచ్చెత్తుతారు — అంచేత ఆమెకు మగవాళ్లగురించి ఆలోచనబాధలేదు — కానీ ఆమెకు — మగవాడి తలపే యెంతో హాయినిస్తుంది! అందులో ఒక అందగాడు అతని తొలివలపు తనమీద కురిపించాడంటే - ఆమె హృదయంలో శాశ్వతకాలం వెలిగే దీపం, ఆక్షణం వెలిగింపబడ్డది! అదే తలచుకొని ఆమె బ్రతికి

నంతకాలం సంతోషిస్తుంది! ఈమాత్రం బాధపడు తున్న తోడిస్త్రీమీద సానుభూతి నాభార్యకు లేక పోయింది—

గడచిపోయిన గాథలనుంచి నేర్చుకోని, మనిషి తన భవిష్యత్తును నిర్మించుకోకపోతే, మనిషికి పతనం తప్పదు—అలానే జరిగిన చరిత్రను మరచిన దేశం, –ప్రపంచం—పతనం కాక తప్పదు—! సంఘజీవులైన మానవులు చావుని జయించలేరు — అంచేత వారు చనిపోయేటప్పుడు యేదో ఒకశక్తికి, యీ భూమిమీద గడిపిన యింతకాలంలో చేసిన మంచి చెడ్డలు విన్నవించవలసి వుంటుంది. — ఆశక్తినే దేవుడందాం! ఆదేవుడు నా భార్యను చనిపోయేటప్పుడు "నువ్వ బతికినంతకాలం యేంచేశావ్" అని అడిగితే నా భార్యకు చెప్పటానికి "నాయిల్లు, నామొగుడూ, నాపిల్లలు,—నాసోఫాలు—నా జార్జెట్ చీరలూ—నా నెక్ లేసులూ" అంతా నేను... నేను..." అని తప్పించి ఒకరికొక మేలు చేశాను, ఒకరి బాధలను పంచుకున్నాను" అని చెప్పగలదా?

ఈవేళనే నేనొక జబ్బుపడి, లేక ఏదో మహామ్మారికి లోనై అసహ్యంగా తయారైతే, ప్రసాదరావుగతే నాకూ పట్టుందని నాకు తెలుసు! నేను కాంక్షించింది నా భార్యదగ్గర లేదు—! నీ—"

ఉత్తరం పూర్తిచేసేసరికి రాత్రి రెండు గంటలయింది. ఉత్తరం మొదట్లో "ప్రియమైన" తరవాత "ప్రమీ" అని చేర్చాడు.

ఆ మరుసటిరోజు మౌనం దాల్చాడు. ఆ వుత్తరం ఆఫీసుకు వెళ్ళాక ప్రమీల చదివింది—మళ్ళీ మళ్ళీ చదివింది. రెండు రోజులైనా వెంకటేశ్వరరావు మౌనంగానే వున్నాడు. ఆమెకు ఆ ఉత్తరం కంఠస్థమైంది!

ఆమె పరిస్థితిలో మార్పు లేనట్టే వుంది.—భర్తను అర్థంచేసుకున్నట్లు అగుపించలేదు. ఏడుపూ లేదు—నవ్వూ లేదు—అలాంటి వింకేమీ లేవు. ఉత్తరం రాసిన మూడో రాత్రి పదకొండు గంటలయింది.—వెంకటేశ్వరరావు పుస్తకం మూసి పక్కగదిలోకి వెళ్ళాడు. ప్రమీల తెలివితోనే వుంది. గడచిన మూడు రాత్రులనుంచి ఆమె నిద్దర సరిగా పోలేదు—భర్త ఆమెదగ్గరగా వస్తాడని అనుకోలేదు–వచ్చాడు. ఆయనతాకగానే ఆమె శరీరమంతా ఒక్కసారి వణికింది. ఎత్తిన ముఖానికి భర్త చిరునగవు అవుపించటంతో, కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయ్. ప్రక్కన కూర్చుని దగ్గరగా ఆమెను చేర్చుకుంటూంటే, పెల్లుబికిన దుఃఖంతో భర్త భుజంమీద వాలి, వెక్కి వెక్కి యేడ్చింది!

అతని హృదయం మాట్లాడటం విన్నది. ఇప్పుడు ఆమె కౌగిలిలో వున్నది అతని భౌతిక శరీరమే కాదు—మహత్తరమైన మరి యింకేదో!